క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆందోళన

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని రామానుజగూడెం నుంచి సజ్జలబోడు వరకు కొత్త రోడ్డు సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల ప్రజలు బుధవారం ఆందోళన చేపట్టారు. రామనుజగూడెం, తునికిబండల గ్రామస్తులు బుధవారం అధ్వానంగా రహదారి పరిస్థితిని చూపిస్తూ అక్కడే ఆందోళన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

మణుగూరురూరల్: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మణుగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు సందర్శించి వడ్లలోని తేమ శాతాన్ని, తూర్పారబట్టే యంత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తేమశాతం లేకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గోనె బస్తాలు, లోడింగ్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానదాస్, సంతపురి శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి

మణుగూరుటౌన్: ఏరియాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ యూనియన్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశం నిర్వహించినట్లు ఆయన బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ఏరియాలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు అన్నిమైన్లు, డిపార్ట్‌మెంట్ల వద్ద రెస్ట్ సెంటర్లు, వాష్‌రూంలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సింగరేణి జీఎం దుర్గం రాంచందర్, డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్, మల్లెల వెంకటరామ నర్సయ్య, మేకల ఈశ్వర్‌రావు, పుల్లారావు, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామానుజవరంలో సర్వే

మణుగూరురూరల్: మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సర్వేను పరిశీలించారు. అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబ వివరాలను ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ ద్వారా నమోదు చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రగ్గుల వితరణ

అశ్వారావుపేటరూరల్: చలితో గిరిజన కుటుంబాలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా రగ్గులను అందించారు. మండలంలోని నున్నంబట్టి సమీపంలోని దిబ్బగూడేనికి చెందిన 40 కుటుంబాలకు ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి చేతులమీదుగా పంపిణీ చేశారు. తమ ట్రస్టు ద్వారా ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దోమతెరల పంపిణీ

పినపాక: మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన పిట్టతోగు గ్రామస్తులకు ప్రానిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ-బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులను సీఐ అభినందించారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఆదివాసీలు అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ములకలపల్లి: మండలంలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన బొంతు బసవయ్య, సత్యనారాయణ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు వేర్వేరుగా పరామర్శించారు. వీరి తండ్రి బొంతు రత్తయ్య ఇటీవల మరణించగా.. బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోరంపూడి అప్పారావు, నందమూరి సురేశ్, బాజీబాబు, చెన్నకేశవులు, నందు, తేళ్ల చెన్నయ్య, తన్నీరు చిన్నపుల్లయ్య, కరుటూరి కృష్ణ, తన్నీరు నాగయ్య, లోకేశ్, బైటి రాజేశ్ ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

చర్ల: పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలను విడుదల చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు చల్లగళ్ల సతీశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో తడికల శివకుమార్, కొండా చరణ్, కొప్పుల నారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాత్రి ప్రయాణాలు మానుకుంటే మేలు



ఖమ్మంక్రైం: విపరీతమైన చలికి తోడు మంచు కురుస్తుండడం.. చలితో చేతులకు పట్టు లభించే అవకాశం ఉండనందున రాత్రి సమయాన ప్రయాణాలతో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశముంది. రాత్రివేళ సాధ్యమైనంత మేర దూరం వెళ్తే ఉదయం ఇతర పనులు చేసుకోవచ్చని భావిస్తుంటారు. కానీ ప్రస్తుత సమయాన రాత్రి ప్రయాణాలు మానుకుంటేనే మేలని ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వరప్రసాద్ సూచించారు. ఈ మేరకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వెల్లడించిన వివరాలు... త్వరలో క్రిస్మస్ సెలవులు, నూతన సంవత్సరం వేడుకలకు పలువురు విహార యాత్రలకు వెళ్లే అవకాశముంది. మధ్య తరగతి ప్రజలు కూడా సొంత కార్లు ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు చలి ప్రభావం ఉన్నందున పగటి వేళ ప్రయాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరి రాత్రిపూట వెళ్లాల్సి వస్తే కారుకు ఫాగ్ ల్యాంప్‌లు వేసుకోవాలి. అలాగే ఎమర్జెన్సీ లైట్లు కూడా వాడాలి. వేగంగా కాకుండా 40 నుంచి 50 కి.మీ.కు మించి వేగంతో వెళ్లొద్దు. తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటున్నందున కారు వైపర్లు పనిచేస్తున్నాయో, లేదో పరీక్షించుకోవాలి. అలాగే, కారులో హీటర్ పనితీరును గమనించాలి. ఇక ద్విచక్రవాహనదారులు సైతం రాత్రివేళ ప్రయాణించాల్సి వస్తే ఎమర్జెన్సీ లైట్లు తప్పక వాడాలి. చేతులకు గ్లౌస్ వేసుకుంటే పట్టు ఉంటుంది.


వరప్రసాద్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ, ఖమ్మం

చలివేళ.. గ్యాడ్జెట్ల వాడకంలో అప్రమత్తత



ఖమ్మం మయూరిసెంటర్: ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయిలో నమోదవుతున్నప్పుడు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలోని విడిభాగాలు ప్రభావితం అవుతాయి. ఈ మేరకు వీటిని ఉపయోగించే వారు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఖమ్మంకు చెందిన హార్డ్‌వేర్ నిపుణుడు జి.కోటి వివరించారు. మంచు కురిసే సమయాన బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైల్స్ వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదముంటుంది. ఈ కారణంగా తడితో విడిభాగాలు కాస్త దెబ్బతింటాయి. అందువల్ల మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగం తగ్గించడం మంచిది. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు కంప్యూటర్లు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడిభాగాలపై కొంత ప్రభావం ఉంటుంది. ఇదే సమయాన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం చూపదు. ఇక కలర్ ప్రింటర్లను ప్రతిరోజు తప్పక వినియోగించాలి. ఇందులో భాగంగా రోజుకొక ప్రిం ట్ అయినా తీయాలి. తక్కువ ఉష్ణోగ్రతలు నమో దయ్యే సమయంలో వీటిని వినియోగించకుంటే పని చేయడం అగిపోతాయి.


జి.కోటి, ఖమ్మం

నిద్రలో నిఘా నేత్రం..

- భద్రగిరిలోని కీలక కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు
- మరమ్మతులు చేయించని అధికారులు
- కొన్ని నెలలుగా పని చేయని వైనం
- 140లో పనిచేసేవి 70 మాత్రమే

భద్రాచలంఅర్బన్: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని చెప్పే ఉన్నతాధికారులు.. వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు. కీలకమైన కూడళ్లలో నిఘా నేత్రాలు మొద్దు నిద్దరోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భద్రాచలం పట్టణంలో చాలా చోట్ల నెల తరబడి పనిచేయకున్నా మరమ్మతులు చేయించడం లేదంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే భద్రాచలంలో సీసీ కెమెరాల నిర్వహణలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే వినియోగంలోకి తీసుకుని రావాలని కోరుతున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 ఆగస్టులో అప్పటి జిల్లా ఎస్పీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో ఉన్న వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఇతరుల సహకారంతో దాదాపు రూ.26 లక్షల వ్యాయంతో 89 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. క్రమక్రమంగా పట్టణ ప్రముఖులు, వ్యాపారుల ఆర్థిక సాయంతో ఆ సంఖ్య ఇప్పుడు 140కి చేరింది. సీసీ కెమెరాల వినియోగంతో భద్రాచలం పట్టణంలో గతంలో జరిగిన పలు కేసుల్లో త్వరతగతిన పురోగతి సాధించారు. రోజులు గడుస్తున్నా కొద్దీ 140 సీసీ కెమెరాల్లో పనిచేయని వాటి సంఖ్య పెరుగుతూ వచ్చి.. ప్రస్తుతం 70 కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. పట్టణంలోని సూపర్‌బజార్, కూనవరంరోడ్డు, తాతగుడి సెంటర్‌తో పాటు పలు ప్రధాన కూడళ్లలో పోలీసుల ఆధ్వర్యంలో లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా నిర్వహణ సరిగ్గా లేక నిరూపయోగమవుతున్నాయి.


పట్టణంలోని పాత మార్కెట్ వద్ద పనిచేయని సీసీ కెమెరా

లోటు బడ్జెట్.. నిర్వహణ లోపం

కొన్ని నెలలుగా పట్టణంలో దాదాపు 70 సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో నేరాల నియంత్రణలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా దొంగతనాలు, వాహనాల దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అందుకు బాధ్యులను వెంటనే గుర్తించేందుకు పోలీసులు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి నెలకొంది. వీటి నిర్వహణను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తే కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేసే అవకాశం ఉంది. కాగా, సీసీ కెమెరాల మరమ్మతుల భారాన్ని ఎవరు భరించాలో స్పష్టత లేకపోవడంతో వాటి నిర్వహణలో జాప్యం జరుగుతోందని సమాచారం. ఇటీవల కూనవరం రోడ్డులో సుమారు రెండు లక్షల విలువ గల ఇంటర్నెట్ యంత్రం చోరీకి గురికాగా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగతనం చేసిన వ్యక్తిని గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం..



భద్రాచలంలో పనిచేయని సీసీ కెమెరాలను త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం. మరి కొన్ని సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నాం. బడ్జెట్ కారణంగా పరిష్కారం ఆలస్యమైంది. ఎస్పీ ఆదేశాలతో నేరాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ ప్రజలు కూడా అవకాశం ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

–వంగా రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎస్పీ, భద్రాచలం

పోలీసులు స్పందించాలి..



దాతల ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పోలీసులు వాటి నిర్వహణ బాధ్యతను తీసుకోవాలి. పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేసినన్ని రోజులు నేరాల సంఖ్య తగ్గిపోయింది. ఇప్పుడు అవి పనిచేయకపోవడంతో నేరస్తులకు భయం లేకుండా పోయింది. పోలీసులు పనిచేయని సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలి.

–వెంకీ, రాజీవ్‌నగర్, భద్రాచలం

మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ


మణుగూరురూరల్: ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్, తదితరులు


దమ్మపేట: విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: మాదకద్రవ్యాల నిర్మూలన పోరాటంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేటి సమాజంలో కొందరు యువత మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చీకటిమయం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలను నివారించడంలో పోలీస్‌శాఖ ఎంతో శ్రమిస్తోందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల మానసిక స్థితిని కోల్పోయి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, గంజాయి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలను రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్‌ఐలు మేడ ప్రసాద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మాదక ద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం సమాజ వినాశనానికి కారణభూతం అని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లితండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఖుర్షీద్

సాక్షి ఎఫెక్ట్..

చండ్రుగొండ: మండల కేంద్రంలో ఎట్టకేలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ ప్రారంభించారు. రైతుల కష్టం .. దళారుల పాలు అనే శీర్షికతోపాటు వరుసగా సాక్షిలో ప్రచురితమైన కథనాలతో పాటు కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, కీసరి కిరణ్‌రెడ్డి కృషితో కేంద్రం మంజూరైంది. ఈ సందర్భంగా సహకార అధికారి ఖుర్షీద్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఆరబెట్టిన ధాన్యం కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు, వైస్‌చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, కొడకండ్ల వెంకటరెడ్డి, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, కీసరి కిరణ్‌రెడ్డి, వారాధి సత్యనారాయణ, దారా వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి సురేశ్, మెడా మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


బూర్గంపాడు: నూతన వస్త్రాలు అందిస్తున్న పాస్టర్ ములక మోజెస్

బూర్గంపాడు: హైదరాబాద్‌కు చెందిన షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సారపాకలోని సీయోను ప్రార్థన మందిరంలో బుధవారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. షిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ ములక మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, కరకగూడెం, పినపాక, కుక్కునూరు, వేలేరుపాడు, ఎటపాక, వీఆర్‌పురం, కూనవరం, రంపచోడవరం, మారేడుమిల్లి, రాజుపేట మండలాలకు చెందిన 150 మంది పాస్టర్లకు రూ.3.5 లక్షల విలువ గల నూతన వస్త్రాలు, బ్యాగులు, ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడారు. క్రీస్తు చూపిన ప్రేమను అందరికీ పంచాలన్నారు. కార్యక్రమంలో జనగామకు చెందిన అగాపే ఇంటర్ ఫెయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ కేఎం జాన్, జయమణి జాన్‌లు ఈ ప్రాంత సేవకులకు నూతన వస్త్రాలను అందించారు. హైదరాబాద్‌కు చెందిన బ్రదర్ జోనా బ్యాగులను అందజేశారు. డి.పెద్దారావు, పాస్టర్లు సైమన్, రాజీవ్‌తో పాటు మోతుకూరి చరణ్, స్టీవ్ ఎలియట్ ములక, ప్రవీణ్, ఇమ్మాన్యుయేల్, యాకూబ్, మహిమ కుమార్, పాల్, జోనతాన్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో..


దమ్మపేట: మండలంలోని పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సుధాపల్లి గ్రామంలో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, శ్రీను దంపతులు పాల్గొన్నారు. దమ్మపేట గ్రామంలోని ఇమ్మాన్యుయేల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ప్రార్థనలు నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నారులకు నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్‌రావు, కేవీ సత్యనారాయణ, పండేటి వెంకటేశ్వరరావు, పాస్టర్లు ఎలికే ఏసుపాదం, దేవయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యత

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. కాంగ్రెస్ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన బుర్కా అశోక్‌ను అశ్వాపురంలో బుధవారం బ్రహ్మయ్య సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ముత్తినేని వాసు, వేములపల్లి కృష్ణార్జున్ రావు, నాయకులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాలకు అంకురార్పణ

చర్ల: దుమ్ముగూడెంలో రెండేళ్లకోసారి నిర్వహించనున్న శ్రీ ముత్యాలమ్మ జాతర మహోత్సవానికి సంబంధించి బుదవారం అంకురార్పణ చేశారు. 23వ జాతర మహోత్సవానికి సంబంధించి ఉదయం 9.05 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాలకు చెందిన మహిళలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుభ ముహర్తపు రాటా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం కొనసాగింది. ఉత్సవాలు ఈ కార్యక్రమం తర్వాత ప్రారంభం కానున్నాయి. కార్యాక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేశ్‌రెడ్డి, కార్యదర్శి బైరెడ్డి సతీశ్, కమిటీ సభ్యులు గణేశ్, నాగేశ్వరరావు, మల్లూరు, సాయి, వేణు, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


శుభ ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

కేజీబీవీల్లో నిరసన

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బుధవారం నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాలయం ఉపాధ్యాయినులు కొన్నిరోజులుగా సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో విద్యాబోధన స్తంభించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కాగా, అన్నపురెడ్డిపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం ఎదుట విద్యార్థినులు బుధవారం ధర్నా నిర్వహించారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

గుండాల: ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం పోరాటాలే శరణ్యమని టీపీటీఎఫ్ ఉపాధ్యాయదర్శిని సంపాదక వర్గ సభ్యులు రామాచారి, జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు పేర్కొన్నారు. ఆళ్లపల్లి టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు బానోత్ భోజ్యా అధ్యక్షతన బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భిక్షమయ్య, లాలయ్య, కె.రామయ్య, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్, కుమార్‌రాజా పాల్గొన్నారు.

కందకాల పూడ్చివేత

అశ్వాపురం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన వేములూరులో పోడుభూముల్లో ఫారెస్ట్ అధికారులు తవ్విన కందకాలను సీపీఎం గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పూడ్చివేశారు. పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఓటు ప్రాధాన్యతపై ర్యాలీ

మణుగూరురూరల్: ఓటు ప్రాధాన్యతపై మణుగూరు రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యాదగిరి, డీటీఎస్ కృష్ణ మాట్లాడారు. 18 ఏళ్లు నిండినవారంతా ఓటు నమోదు చేసుకుని, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మునగ తోటల పరిశీలన

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పలువురు రైతులు చేపట్టిన మునగ తోటలను స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. బుధవారం మండలంలోని గాండ్లగూడెం, అచ్యుతాపురం, నారంవారిగూడెంతో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న మునగ తోటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 12 ఎకరాల్లో రైతులు మునగ పంటను సాగు చేస్తున్నారని, ఆసక్తి ఉన్న రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ కె.రామచంద్రరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.


మునగ తోటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుండాల: తుడుందెబ్బ తొమ్మిదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకులు కల్తీ మల్లయ్య, ఇర్ప రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శెట్టిపల్లి గ్రామం అల్లూరి సీతారామరాజు సెంటర్లో బుధవారం మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 22, 23 తేదీల్లో ములుగు జిల్లా ఏటూరునాగారంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారని, ఆదివాసీ అస్థిత్వం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. పోడు భూములు, ఆదివాసీల హక్కులు, పెసా చట్టం, 1/70 చట్టం వంటి వాటిపై నేటికీ పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఈర్ప బుచ్చయ్య, కల్తి సురేశ్, వెనక సూర్యం, తాటి శేఖర్, కల్తి సుధాకర్, వై.శరత్, జేజేరి సందీప్, జజ్జరి సాగర్, కత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై ప్రకటన చేయాలి

చర్ల: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, వారికి రూ.26 వేల వేతనం ఇస్తామన్న ఎన్నికల హామీపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకుడు కల్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నిర్బంధాలు, అరెస్టులతో కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే సమ్మెలో పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యాక్రమంలో సురేంద్ర, రాజేశ్, త్రిమూర్తులు, పార్వతి, ఈశ్వరమ్మ, కృపావరం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మచారి